సాక్షి
వికారాబాద్

గురువారం । 17 । ఆగస్టు । 2023



ప్రభుత్వ భూమిలో దు'పట్టా'
పట్టా భూమి...ఆ పక్కనే ప్రభుత్వ భూమి.. ఇంకేముంది. నేతల కన్ను ఆయా భూములపై పడింది. 8లో▸



ఆరేళ్లుగా అవే వేతనాలు!
సంచార పశువైద్యశాలల ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



లైన్ క్లియర్
తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఏర్పాటుకు లైన్ క్లియరైంది. 9లో▸

న్యూస్‌రీల్

భవానిమాతకు ప్రత్యేక పూజలు



భక్తులకు ప్రవచనాలు చెబుతున్న పీఠాధిపతి శంకర్ స్వామీజీ

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్‌లో వెలసిన అంబా భవానిమాతకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమావాస్య కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ పీఠాధిపతి శంకర్ స్వామీజీ భవాని మాతను ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో కర్ణాటక, మహారాష్ట్ర భక్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ దోచుకునే పార్టీ

మాజీమంత్రి ప్రసాద్‌కుమార్



తిరుపతయ్యను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీమంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్

ధారూరు: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి నూకలు చెల్లాయని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని స్టేషన్ ధారూరు మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు తిరుపతయ్య హైదరాబాద్‌లో మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తిరుపతయ్య, అతని అనుచరులు పుల్‌సింగ్, రాజు, తులసీరాం, దేవ్‌సింగ్‌కు గడ్డం ప్రసాద్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ తోపాటు అందరూ దోచుకోవడమే తప్పా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధిని పూర్తిస్థాయిలో విస్మరించారని ఆరోపించారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రతో దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పీ రాములు, నాయకులు మమ్మద్ బాబాఖాన్, అశోక్ ముదిరాజ్, అవినాష్‌రెడ్డి, విజయ్, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు, చెత్త తొలగించండి

- డీపీఓ తరుణ్‌కుమార్
- పలు గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు



బుద్దారంలో మురుగు కాలువను పరిశీలిస్తున్న డీపీఓ తరుణ్‌కుమార్

పెద్దేముల్: ప్రధాన రహదారులు, వీధుల్లో చెత్త, మురుగును వెంటనే తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని గాజీపూర్, బుద్దారం, పెద్దేముల్, కందనెల్లి తండాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గురువారం పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా బంట్వారం నుంచి తాండూరు వరకు రానుండడంతో జిల్లా అధికారులు ఆయా గ్రామాల్లో పర్యటించారు.రోడ్ల పక్క పేరుకుపోయిన చెత్తను తొలగించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

బరిలో నిలవాల్సిందే..

- నాలుగేళ్లుగా అవమానాలు భరించాం
- టికెట్ రాకున్నా.. పోటీ చేయాల్సిందే
- ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డిపై మద్దతుదారుల ఒత్తిడి

తాండూరు: తాండూరు అసెంబ్లీ స్థానానికి పోటీ చేయాల్సిందేనని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డిపై ఒత్తిడి తెచ్చారు. బుధవారం ఆయన వర్గీయులు, యాలాల, పెద్దేముల్, బషీరాబాద్, తాండూరు మండలం, మున్సిపాలిటీకి చెందిన పార్టీ నేతలు హైదరాబాద్‌కు వెళ్లి మహేందర్‌రెడ్డిని కలిశారు. తాండూరు అసెంబ్లీకి పోటీ చేయాల్సిందేనని కోరారు. 2018లో ఓడిపోయినా మీ వెంటే ఉన్నామని, నాలుగేళ్లుగా ఎన్నో అవమానాలు భరించామని పేర్కొన్నారు. అధికార పార్టీలో ఉండి అక్రమ కేసులు ఎదుర్కొన్నామని మహేందర్‌రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. బీఆర్‌ఎస్ టికెట్ రాకపోతే రెబల్‌గా పోటీ చేయాలని కోరారు. అధికార ఎమ్మెల్సీగా ఉండి కష్టనష్టాలు చవి చూశామని ఆవేదన వ్యక్తం చేశారు.

టార్గెట్..'వైన్స్'



- మద్యం షాపులు దక్కించుకోవడమే లక్ష్యంగా గ్రూపులు
- ఒక్కో దానిలో వంద నుంచి వెయ్యి మంది సభ్యులు
- అత్యధిక సేల్స్ ఉన్న దుకాణాలపై కన్ను
- జిల్లాలోని 59 షాపులకు 1100 దరఖాస్తులు
- మరో రెండు రోజుల గడువు
- గత ఏడాదిని మించనున్న ఆదాయం
- షాపుల సంఖ్య పెరగక పోవడంపై అనుమానాలు



మద్యం దుకాణానికి టెండర్ వేస్తున్న వ్యాపారులు

వికారాబాద్: మద్యం దుకాణాలు చేజిక్కించుకోవడమే లక్ష్యంగా కొంత మంది గ్రూపుగా ఏర్పడి ఎక్కువ దరఖాస్తులు వేసినట్లు తెలుస్తోంది. ఒక్కో గ్రూపులో 100నుంచి 1000 మంది సభ్యులు ఉన్నట్లు సమాచారం. వీరు మూడు నుంచి ఐదు జిల్లాల పరిధిలోని మద్యం షాపులకు టెండర్లు వేసినట్లు తెలిసింది. టెండర్ డబ్బులు నష్టపోకుండా సిండికేట్‌గా మారుతున్నారు. గ్రూపులోని ఏ ఒక్కరికి దుకాణం వచ్చినా సభ్యులందరూ వ్యాపారంలో భాగస్వాములు కావచ్చనే ఉద్దేశంతో ఇలా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా చాలా చోట్ల ప్రభుత్వ ఉద్యోగులు సైతం వారి కుటుంబ సభ్యుల పేరిట దరఖాస్తులు వేసినట్లు తెలిసింది. మహిళలు సైతం దరఖాస్తు చేశారు. జిల్లాలో అత్యధిక సేల్ ఉన్న 20 దుకాణాలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. వీటిపై కూడా గ్రూపు సభ్యులు కన్నేసినట్లు తెలిసింది. పలుకుబడి ఉన్న కొంత మంది వ్యాపారులు తాము ఎంచుకున్న దుకాణాలకు ఎవరూ పోటీ రాకుండా ప్రయత్నం చేశారనే ప్రచారం జరుగుతోంది. జిల్లాలో పరిగికేంద్రంగా ఎక్కువ గ్రూపులు ఏర్పడి మద్యం షాపులకు దరఖాస్తులు వేశారు. కొన్ని చోట్ల మద్యం విక్రయాలు బాగానే ఉన్నా దరఖాస్తులు తక్కువగా రావడంపై అనుమానాలకు తావిస్తోంది.

పెరిగిన పోటీ

అందరూ ఊహించినట్లుగానే జిల్లాలో మద్యం దుకాణాలకు పోటీ పెరిగింది. 2021తో పోలిస్తే ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య పెరగనుంది. మరో రెండు రోజుల గడువు మిగిలి ఉండగానే 1100 దరఖాస్తులు వచ్చాయి. గతేడాది జిల్లాలోని 59 మద్యం దుకాణాలకు 921 దరఖాస్తులు రాగా రూ. 18.42 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్య ఆదాయం కూడా పెరగనుంది.

పెరగని షాపుల సంఖ్య

2021లో జిల్లా వ్యాప్తంగా కొత్తగా 13 మద్యం దుకాణాలను ఏర్పాటు చేశారు. ఈ ఏడాది అదనంగా ఒక్క షాపు కూడా ఏర్పాటు కాకపోవడంపై ఎక్సైజ్ శాఖ అధికారులపై అనుమానాలు తలెత్తుతున్నాయి. గతేడాది బెల్టు షాపుల్లో అధిక విక్రయాలను గుర్తించిన అధికారులు, వాటి నియంత్రణకు 13 కొత్త దుకాణాలు ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకున్నారు. గత రెండేళ్లతో పోలిస్తే మద్యం అమ్మకాలు భారీగా పెరిగినా ఈ ఏడాది షాపుల సంఖ్య పెంచలేదు. అధికారులకు మద్యం వ్యాపారులతో ఉన్న లోపాయికారి ఒప్పందాల వల్లే ఇందుకు కారణమనే పలువురు ఆరోపిస్తున్నారు.

1,100 దరఖాస్తులు

అనంతగిరి: జిల్లాలో 59 మద్యం దుకాణాలకు 1,100 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్‌చంద్ర తెలిపారు. బుధవారం ఒక్కరోజే 193 దరఖాస్తులు వచ్చాయన్నారు. వికారాబాద్ ప్రాంతంలో 15 దుకాణాలకు 355 దరఖాస్తులు, పరిగిలో 44కు గాను 279, తాండూర్ 18కు గాను 222, మోమిన్‌పేట 6కు గాను 145, కొడంగల్ 8కు గాను 99 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. శుక్రవారం సాయంత్రం 5గంటలతో గడువు ముగుస్తుందని, ఆసక్తిగల వారు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు.

గల్లీకో 'బెల్టు'

- 60నుంచి 70శాతం బెల్టు షాపుల్లోనే విక్రయాలు
- ప్రతి మండలంలో 100కు పైగా దుకాణాలు
- జిల్లా వ్యాప్తంగా 1,800 వరకు ఉన్నట్లు అంచనా
- ప్రోత్సహిస్తున్న ఎక్సైజ్ శాఖ
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసు శాఖ



కిరాణా దుకాణంలో మద్యం విక్రయాలు

వికారాబాద్: గ్రామాల్లో బెల్టు షాపులు పుట్టగొడుగులను తలపిస్తున్నాయి. చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్, పోలీసు శాఖలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. 2015కు ముందు పల్లెల్లో సారా రక్కసిని తరిమేసిన ఎక్సైజ్ శాఖ అధికారులు బెల్టు షాపులను మాత్రం ప్రోత్సహిస్తున్నారనేది వాస్తవం. సారా పూర్తిస్థాయిలో తగ్గినా మద్యం మాత్రం ఏరులై పారుతోంది. అయితే బెల్టు షాపుల నిర్వహణ మొత్తం ఎక్సైజ్ శాఖ కనుసన్నల్లోనే జరుగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా నెలనెలా మామూళ్లు తీసుకుంటున్నారనేది బహిరంగ రహస్యం.. పోలీసుల కూడా మామూళ్లు ముట్టడం వల్ల చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

అధిక ధరలకు విక్రయాలు

బెల్టు షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. తండాలు, మారుమూల అటవీ ప్రాంతాల్లో ఇష్టం వచ్చిన ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిసింది. బీరు, క్వార్టర్ బాటిల్, హాఫ్, ఫుల్ బాటిల్‌పై రూ. 10నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఒకవేళ పోలీసుల దాడుల్లో బెల్టు షాపుల నిర్వాహకులను అరెస్టు అయితే వారికి సంబంధిత మద్యం దుకాణ యజమానులు రక్షణగా నిలుస్తున్నారు. వారి పలుకుబడితో కేసులు కాకుండా చూస్తున్నారు.

మామూళ్ల మత్తులో యంత్రాంగం

గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్, పోలీసులు అధికారులు పట్టించుకోవడం లేదు. మెజార్టీ కిరాణా దుకాణాల్లో మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. ఒక్కో ఎక్సైజ్ ఠాణా పరిధిలో 400వరకు బెల్టు షాపులు ఉన్నట్లు సమాచారం. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 1,600 నుంచి 1,800 పైచిలుకు బెల్టు షాపులు ఉన్నట్లు ఓ అంచనా. మద్యం దుకాణాల్లో 30శాతం విక్రయాలు ఉండగా, బెల్టు షాపుల్లో మాత్రం 70 శాతం విక్రయిస్తున్నారు. రోజుకు రూ. లక్ష అమ్మకాలు దాటని షాపుల్లో సైతం నేడు రూ. 5నుంచి రూ. 10 లక్షలు దాటి సేల్స్ ఉంటున్నాయి. ఇది బెల్టు షాపుల నిర్వహణ వల్లే అన్నది నిజం. ఒక్కో మద్యం దుకాణం నుంచి ఎక్సైజ్ పోలీసులకు నెలకు రూ. 17 వేల నుంచి 20 వేల వరకు, సివిల్ పోలీసులకు నెలకు రూ. 15 వేలు అందుతున్నట్లు తెలిసింది. టెండర్లు వేసి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసే సమయంలో, తిరిగి ఆరు నెలలకు ఒక్కసారి ఒక్కో దుకాణం నుంచి రూ. 40 రూ. 60వేల వరకు గుడ్‌విల్ రూపంలో తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా ఉన్నతాధికారుల పేరుతో అప్పుడప్పుడు వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్వర్ణకుమారి

చేవెళ్ల: ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్వర్ణకుమారి అన్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ నగర్ కాలనీలో బుధవారం లెప్రసీ వ్యాధి నివారణకు చేపట్టిన ఇంటింటి సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. లెప్రసీ వ్యాధిపై గ్రామాల్లో ఇంటింటికీ పర్యటిస్తూ వారి శరీరంపై తెల్ల, నల్ల మచ్చలు, స్పర్శలేని మచ్చలను పరిశీలిస్తూ వివరాలు సేకరిస్తున్నామన్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మండల పరిధిలోని ఆలూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో ఈ ఇంటింటి సర్వే చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలూరు పీహెచ్‌సీ మెడికల్ అఫీసర్ డాక్టర్ ప్రసాద్, సూపర్‌వైజర్ పాలమ్మ, ఏఎన్‌ఎం,ఆశవర్కర్లు పాల్గొన్నారు.

గుట్టలో వాహనాల స్టంట్స్



అనంతగిరిలో ఘటన స్థలంలో విచారిస్తున్న ఫారెస్టు విజిలెన్స్ అధికారులు

పంద్రాగస్టున బైక్‌లు, కార్లు, థార్ వాహనలతో చేసిన స్టంట్‌లు నెట్టింట్లో వైరల్ అయ్యాయి. దీంతో ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు ఫారెస్ట్, పోలీసులు శాఖ అధికారులు విచారణ చేపట్టారు.

- నెట్టింట్లో వైరల్
- విచారణకు ఆదేశించిన ఉన్నతాధికారులు

అనంతగిరి: స్వాతంత్య్ర దినోత్సవం రోజున అనంతగిరి గుట్ట వాహనాల స్టంట్‌లతో హోరెత్తింది. గుట్టలో ఉన్న ఆస్పత్రి సమీపంలో ఛత్రి స్పాట్ వద్దనున్న ఖాళీ ప్రదేశంలో బైక్‌లు, కార్లతో పెద్దగా హారన్లు, సైలెన్సర్‌ల చప్పుళ్లతో రయ్‌రయ్‌మంటూ స్టంట్‌లు చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా ఎర్ర మట్టి దుమ్ము కమ్ముకుంది. ఏం జరుగుతుందో తెలియక పర్యాటకులు అక్కడకు చేరకున్నారు. ప్రమాదకరంగా చేస్తున్న స్టంట్‌లను చూసి ఆందోళనకు గురయ్యారు. ఈ తతంగమంతా షూట్ చేసిన పర్యాటకులు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయ్యాయి. ఉన్నతాధికారులకు విషయంతో తెలియడంతో విచారణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

వివరాల సేకరణలో అధికారులు

ఈ మేరకు బుధవారం ఫారెస్టు శాఖ విజిలెన్స్ టీం అధికారి రాజా రమణారెడ్డి ఆధ్వర్యంలో అధికారుల బృందం అనంతగిరికి చేరుకుని రేసింగ్, స్టంట్ చేసిన ప్రదేశాలను పరిశీలించింది. ఈ ఈవెంట్ చేసిన వారెవరు..? ఎంతమంది పాల్గొన్నారు. వచ్చిన వాహనాల వివరాలను సేకరిస్తున్నారు. జిల్లా పోలీసు యంత్రాంగం సీసీ ఫుటేజీలు, వీడియోలు తదితర ఆధారాలతో విచారణ చేపట్టింది. అటవీ, పోలీసు శాఖ సంయుక్తంగా వివరాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. కాగా మంగళవారం స్వాతంత్య్ర దినోత్సవంలో ఫారెస్టు, పోలీసు సిబ్బంది బందోబస్తు, నిర్వహణ ఏర్పాట్లలో ఉన్న సమయంలో సుమారు 20 పెద్ద కార్లు, 30వరకు బైకులు వచ్చినట్లు అధికారులు గుర్తించారు. వాహనాల నంబర్ల ఆధారంగా సదరు వ్యక్తులను గుర్తించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఫారెస్ట్ అధికారుల ఫిర్యాదు మేరకు వికారాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విచారణ చేపట్టాం

అనంతగిరిగుట్టలో మంగళవారం నిర్వహించిన బైక్, కార్ల రేసింగ్, స్టంట్‌ల విషయంలో ఇప్పటికే ఫారెస్టు విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో విచారణ ప్రారంభించాం. ఇలాంటి ప్రమాదకర కృత్యాలు చేయడం సరికాదు. ఇది ఎవరు నిర్వహించారు. ఎన్ని వాహనాలు, ఎంతమంది పాల్గొన్నారనే వివరాలు సేకరిస్తున్నాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. మరోసారి ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా కఠినంగా వ్యవహరిస్తాం.

– జ్ఞానేశ్వర్, డీఎఫ్‌ఓ

కఠిన చర్యలు తీసుకుంటాం



అనంతగిరి ప్రాంతంలో నిర్వహించిన బైక్, కార్ రేస్‌పై విచారణ చేపట్టాం. సీసీ కెమెరాల ఆధారంగా వాహనాలను గుర్తించి పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటాం. అనంతగిరిలో పెట్రోలింగ్‌ను పెంచుతాం. బైక్, కార్ రేసింగ్ లాంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– కోటిరెడ్డి, ఎస్పీ

ఎవరో.. 'గృహలక్ష్మి'

- జిల్లా వ్యాప్తంగా 57,571 దరఖాస్తులు
- క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభం
- తొలి విడతలో నియోజకవర్గానికి మూడు వేల చొప్పున ఎంపిక
- 12వేల మందికి లబ్ధి



ఇటీవల గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుంటున్న మహిళలు

వికారాబాద్ అర్బన్: గృహలక్ష్మి పథకం ఎవరిని వరిస్తుందోనని మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ పథకానికి దరఖాస్తు సమయం మూడు రోజులే అయినా పెద్ద సంఖ్యలో మహిళలు అర్జీలు సమర్పించారు. సొంత స్థలం ఉన్న పేదలు ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకం పేరిట రూ. 3లక్షల ఆర్థిక సాయం అందించనుంది. అయితే ఈ పథకాన్ని అన్ని వర్గాల వారికి వర్తింపజేయడంతో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. కేవలం మూడు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 57,571 మంది అర్జీలు సమర్పించారు.

నియోజకవర్గానికి 3వేల చొప్పున

తొలి విడతలో ఒక్కో నియోజకవర్గం నుంచి మూడు వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ లెక్కన జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల నుంచి 12వేల మంది లబ్ధి పొందనున్నారు. దౌల్తాబాద్ మండలం నుంచి అత్యధికంగా 7,553 దరఖాస్తులు రాగా, నవాబుపేట మండలం నుంచి అతి తక్కువ 1,178 అర్జీలు వచ్చాయి.

పరిశీలన ప్రారంభం

సాధ్యమైనంత తొందరగా పేదలకు గృహలక్ష్మి పథకాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అర్జీల పరిశీలన, అర్హుల ఎంపిక వంటి వాటిని సత్వరం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో సోమవారం నుంచి క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ నాటికి ప్రక్రియను పూర్తి చేసి అర్హులను గుర్తించాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఇందులో భాగంగా నియోజకవర్గానికి ఒక నోడల్ అధికారి, ప్రతి మండలానికి ఒక వెరిఫికేన్ అధికారిని సైతం నియమించారు. దరఖాస్తుల పరిశీలన పూర్తి కాగానే అర్హుల జాబితాను తయారు చేసి ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన కోటా ప్రకారం ఇళ్లు మంజూరు చేయనున్నారు.

25న తొలివిడత

దరఖాస్తు చేసినా తొలి విడతలో గృహలక్ష్మి పథకం అమలు కాని అర్హులకు తదుపరి విడతల్లో ఆర్థిక సాయం మంజూరు చేయాలని నిర్ణయించారు. ఎస్సీలకు 20శాతం, ఎస్టీలకు 10శాతం, బీసీలకు 50శాతం, దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. అయితే ఎంపికైన లబ్ధిదారులకు రూ. 3లక్షల ఆర్థిక సహాయాన్ని మూడు విడతల్లో ఇవ్వనున్నారు. పునాది పనులు పూర్తి కాగానే మొదటి విడతలో రూ. లక్ష, రూఫ్ లెవల్‌లో రెండో విడత కింద రూ. లక్ష, ఇంటి నిర్మాణం పూర్తయిన తరువాత మూడో విడతలో మరో లక్ష ఆర్థిక సాయం ఇవ్వనున్నారు. ఈ మొత్తాన్ని మహిళా బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నారు. అయితే లబ్ధిదారులు తమకు నచ్చిన విధంగా ఇల్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అయితే ఈ నెల 25న తొలి విడత అర్హుల జాబితా ప్రకటించే అవకాశం ఉంది.

నియోజకవర్గాల వారీగా వచ్చిన దరఖాస్తులు

వికారాబాద్	14,618
తాండూరు	13,285
పరిగి	13,942
కొడంగల్	14,548
నవాబుపేట్	1,178

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

మాజీ మంత్రులు వినోద్‌కుమార్,ప్రసాద్‌కుమార్

మొయినాబాద్‌రూరల్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ గెలుపే లక్ష్యంగా అందరం కలిసి పనిచేద్దామని మాజీ మంత్రులు గడ్డం వినోద్‌కుమార్, గడ్డం ప్రసాద్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మొయినాబాద్ మండల అధ్యక్షుడు మాణయ్య అధ్యక్షతన మండలంలోని కనకమామిడి సమీపంలోని వ్యవసాయ క్షేత్రంలో బుధవారం చేవెళ్ల నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాతూ.. ఈనెల 24న చేవెళ్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి సమావేశానికి పెద్దఎత్తున జన సమీకరణ చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. దాదాపు లక్షకు పైగా జనసమీకరణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీసతీష్, పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు దర్శన్, సీనియర్ నాయకులు భీమ్‌భరత్, వసంతం, మండల అధ్యక్షుడు మాణయ్య పాల్గొన్నారు.

విస్తృత ప్రచారం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి

- ఓటు హక్కు వినియోగంపై తహసీల్దార్లతో కలెక్టర్ నారాయణరెడ్డి టెలీ కాన్ఫరెన్స్

వికారాబాద్ అర్బన్: అర్హులు ఓటు హక్కు వినియోగించుకునేలా విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సీ నారాయణరెడ్డి తహసీల్దార్లకు సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర సంయుక్త ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజీ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ తహసీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలని ఆదేశించారు. జిల్లాలో ఆగస్టు 15వ తేదీ నాటికి ఓటరుగా నమోదు చేసుకున్న వారి గుర్తింపు కార్డులను త్వరగా ముద్రించాలని ఆదేశించారు. జిల్లాలో చాలామంది వీఆర్‌ఏలు బీఎల్‌వోలుగా పని చేస్తుండేవారని, వారిని వేరే శాఖల్లో సర్దుబాటు చేయడం జరిగినందున, అట్టి స్థానాల్లో కొత్తవారిని నియమించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ బుధవారం సాయంత్రం లోపు పూర్తి చేయాలన్నారు. కొత్త బీఎల్‌ఓలకు శుక్ర, శనివారాల్లో శిక్షణ తరగతులు నిర్వహించి వారి పూర్తి సమాచారం ఆన్‌లైన్‌లో పొందు పరచాలని ఆదేశించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరు ప్రాముఖ్యతను వివరిస్తూ 5కే రన్ నిర్వహించాలని సూచించారు.

క్లుప్తంగా

నేడు పూడూరుకు ప్రిన్సిపల్ సెక్రటరీ

పూడూరు: మండలంలో వివిధ అభివృద్ధి పనులను పరిశీలించేందుకు పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా గురువారం రానున్నట్లు ఎంపీడీఓ ఉమాదేవి తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో మీర్జాపూర్‌లో ఏర్పాటు చేసిన అభినవ్ నర్సరీ, ఎన్కేపల్లిలో వజ్రదాల్ మిల్, కండ్లపల్లి గేటు సమీపంలో ఏర్పాటు చేసిన నీలగిరి కేఫ్‌లను పరిశీలిస్తారని తెలిపారు.

యువతి అదృశ్యం

పహాడీషరీఫ్: యువతి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బుధవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ఆర్ల వెంకటేశ్ ఈ నెల 13న తన తల్లి, సోదరి పూజతో కలిసి తుక్కుగూడ బస్టాప్‌కు వచ్చారు. సోదరి ని బస్టాప్‌లో ఉంచి వారు కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. 20 నిమిషాల తర్వా త వారు వచ్చి చూడగా యువతి కనిపించలే దు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె సోదరుడు బుధవారం పోలీసులకు ఫి ర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

శరవేగంగా ఓటరు నమోదు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీష్ తెలిపారు. రాష్ట్ర జాయింట్ ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారులతో గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న వారందరికీ పోస్టల్‌శాఖ ద్వారా గుర్తింపుకార్డులు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సిబ్బంది ఇంటింటికి తిరిగి పరిశీలన చేపడుతున్నారన్నారు. ఓటరు నమోదుకు అవగాహన కల్పించేందుకు ఈనెల 19న అన్ని సెగ్మెంట్ల పరిధి లో 5-కే రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు సహా అందరినీ భాగస్వాములు అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు రెవెన్యూ డివిజనల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో దు‘పట్టా’

- ముందుగా పక్క భూమి కొనుగోలు .. అనంతరం ఆక్రమణకు ప్లాన్
- ఎకరా ప్రభుత్వ స్థలంలో ఫెన్సింగ్ ఏర్పాటు
- ఓ మాజీ మంత్రి నిర్వాకం!
- కనకమామిడి రెవెన్యూలో ఆక్రమణల పర్వం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పట్టా భూమి...ఆ పక్కనే ప్రభుత్వ భూమి.. ఇంకేముంది. నేతల కన్ను ఆయా భూములపై పడింది. తలాపాపం.. తిలాపిడికెడు అన్నట్లు... రాజకీయ ప్రముఖులు.. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇద్దరూ కలిసి రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ భూములను కొల్లగొట్టారు. వాటి చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేసుకున్నారు. అయితే ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాల్సిన రెవెన్యూ అధికారులు కూడా పరోక్షంగా కబ్జాదారులకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మొయినాబాద్ మండలం కనకమామిడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 510లో సుమారు 367 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ఎకరం రూ.4కోట్లకుపైగా ధర పలుకుతోంది. దీనిలో ఇప్పటికే 87 ఎకరాలు స్థానిక నిరుపేదలకు గత ప్రభుత్వాలు అసైన్డ్ చేశాయి. అయితే మిగిలిన భూములపై పెద్దల కన్ను పడింది. ఎలాగైనా ఈ భూములను హస్తగతం చేసుకోవాలని భావించిన కొందరు రియల్టర్లు, రాజకీయ నేతలు ముందుగా.. ఆ పక్కనే ఉన్న పట్టా, అసైన్డ్ భూములను కొనుగోలు చేశారు. ఆయ భూముల్లో ఫాంహౌస్‌లు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదే క్రమంలో వారి భూములకు అటు, ఇటుగా సరిహద్దులోని ప్రభుత్వ భూమికి గుట్టుగా ఫెన్సింగ్ వేస్తున్నారు.



కనకమామిడి సర్వేనం 510లో ప్రభుత్వ భూమిలో వేసిన ఫెన్సింగ్

గతంలో కూడా..

గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి ఈ ప్రాంతంలోనే 10ఎకరాల అసైన్డ్ భూమిని కొనుగోలు చేసి.. దానికి సరిహద్దులో ఉన్న మరో 7ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశాడు. దాని చుట్టూ ప్రహరీ కూడా నిర్మించాడు. కబ్జా విషయం బయటపడంతో అప్పట్లోనే రెవెన్యూ అధికారులకు ప్రహరినీ కూల్చివేశారు. ఆ తర్వాత కొద్దిరోజులకే కూల్చిన ప్రహరీని సదరు ఆక్రమణదారులు మళ్లీ నిర్మించారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేసి..

తాజాగా ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ మాజీ మంత్రి సర్వే నంబర్ 287లో రెండు ఎకరాల పట్టా భూమిని కొనుగోలు చేశాడు. ప్రస్తుతం ఆ భూమిలో ఫాంహౌస్ నిర్మిస్తున్నారు. ఆ పక్కనే ఉన్న ఎకరం ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, పట్టా భూమిలో కలిపేసుకున్నారు. ఈ విషయం తెలిసి కూడా రెవెన్యూ అధికారులు నిమ్మ కు నీరెత్తినట్లు ఉన్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. పరోక్షంగా వారికి సహకరిస్తున్నట్లు తెలిసింది.

చర్యలు తీసుకుంటాం

కనకమామిడి రెవెన్యూలోని ప్రభుత్వ భూమిని పరిశీలిస్తాం. కబ్జాకు గురైనట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. మండలంలో ఎక్కడ కూడా ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే ఊరుకునేది లేదు. సర్వే అనంతరం కబ్జా చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం.

– గౌతం, తహసీల్దార్, మొయినాబాద్

ఆర్డినరీ బస్సుకు.. ఎక్స్‌ప్రెస్ టికెట్

- ఆర్టీసీ తీరుపై ప్రయాణికుల ఆగ్రహం
- ప్రశ్నించిన వారికి దురుసుగా సమాధానమిచ్చిన కండక్టర్



ఆర్డినరీ సర్వీసుకు ఇచ్చిన ఎక్స్‌ప్రెస్ టికెట్

ధారూరు: ధారూరు నుంచి తాండూరు వెపునకు వెళ్తున్న ఓ ఆర్టీసీ బస్సు రాగానే ప్రజలంతా బస్సు ఎక్కారు. టికెట్ తీసుకున్న ప్రయాణికులు విస్తుపోయారు. ఆర్డినరీ బస్సుకు ఎక్స్‌ప్రెస్ టికెట్ తీసారని కండెక్టర్‌ను ప్రశ్నించగా టికెట్‌పై ఎక్స్‌ప్రెస్ అని రాసిఉందని గమనించలేదా అంటూ వారిని దబాయించాడు. ఈ సంఘటన ధారూరు బస్టాండు వద్ద బుధవారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. ప్రయాణికులు బస్సు ఎక్కి టికెట్ తీసుకోగా ఆర్డినరీ బస్సుకు రూ.40 వసూలు చేశారు... ధరలు పెరిగాయా అంటూ ప్రశ్నించారు. టికెట్ ఎక్స్‌ప్రెస్‌ది ఇచ్చానంటూ కండక్టర్ చెప్పారు. దీంతో ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ బస్సులో అద్దాలు, ఇంజిన్ నుంచి ఇలాగే శబ్దం వస్తుందా అంటూ ప్రశ్నించారు. బస్ బోర్డుపై కూడా ఎక్స్‌ప్రెస్ లేదని వాదనకు దిగారు. ఇష్టముంటే కూర్చోండి.. లేదంటే దిగిపోండి.. టిక్కెట్ల డబ్బులు వెనక్కి ఇచ్చేది లేదనడంతో చేసేదేమీ లేక అత్యవసర పనులుండడంతో వెళ్లి వచ్చామంటూ ధారూరుకు చెందిన కల్వ కిరణ్‌కుమార్ చెప్పారు.

‘డయల్ 100’ కాల్స్‌పై నిర్లక్ష్యం వహించొద్దు

ఎస్పీ కోటిరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: డయల్ 100కు వచ్చే కాల్స్‌పై నిర్లక్ష్యం వహించొద్దని ఎస్పీ కోటిరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. బుధవారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పీఎస్‌ల వారీగా కేసుల వివరాల ఫైల్స్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. సత్ప్రవర్తన లేని వారిపై షీట్స్ ఓపెన్ చేయాలని సూచించారు. కేసులు, ఫైల్స్ పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. పోలీసు అధికారులు ప్రతీ శనివారం పీఎస్ సిబ్బందితో సమావేశాలను ఏర్పాటు చేసి మాట్లాడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణకు కళాజాత బృందంతో ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్డన్ సెర్చ్, నాకా బంది, వెహికల్ చెకింగ్, మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరాలు నిరంతరం కొనసాగించాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీటీసీ ఏఎస్పీ మురళీధర్, డీఎస్పీలు సత్యనారాయణ, కరుణాసాగర్ రెడ్డి, శేఖర్ గౌడ్, జానయ్య, వీరేశం, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు దాటుతుండగా..

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి మృతి



చమన్‌సింగ్ మృతదేహం

కందుకూరు: అతివేగంతో ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు ఓ యువకుడిని బలితీసుకుంది. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం .. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాన్పూర్ జిల్లా కాక్రియాకు చెందిన చమన్‌సింగ్(20) కందుకూరు చౌరస్తాలోని బాలాజీ బేకరీలో పనిచేసేందుకు వచ్చాడు. మంగళవారం రాత్రి 10.30గంటల ప్రాంతంలో తనతో పనిచేసే మరో కార్మికుడు శ్యాంసింగ్‌తో కలిసి చౌరస్తాలోని బాల్యానాయక్ హోటల్‌లో భోజనం చేసి బేకరీకి వస్తున్నారు. ఈ క్రమంలో శ్రీశైలం నుంచి హైదరాబాద్ వైపు వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ అజాగ్రత్తతో నడుపుతూ యువకుడిని ఢీ కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని స్థానికులు, పోలీసులు 108 అంబులెన్స్‌లో హైదరాబాద్ ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. ఈ మేరకు బుధవారం ఎస్‌ఐ శ్రావణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసట్టారు.

ఆరేళ్లుగా అవే వేతనాలు!

సంచార పశువైద్యశాలల ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అరకొరగా చెల్లించే జీతాలు సైతం పెండింగ్‌లో ఉంచడంతో కాంట్రాక్టు ఉద్యోగులు అప్పులపాలవుతున్నామని వాపోతున్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచక సతమతమవుతున్నామని వాపోతున్నారు.

- చుక్కలనంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు
- అరకొర జీతాలు సైతం రెండు నెలలుగా అందనివైనం
- ఇబ్బంది పడుతున్న 1962 కాంట్రాక్టు ఉద్యోగులు
- పట్టించుకోని ప్రభుత్వం



సంచార పశు వైద్యశాల వాహనం

కొడంగల్: సంచార పశు వైద్యశాల (1962) ఉద్యోగులకు సకాలంలో జీతాలు అందడం లేదు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరేళ్ల క్రితం రాష్ట్ర వ్యాప్తంగా సంచార పశు వైద్యశాలలను ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు జీతాలు పెంచిన దాఖలాలే లేవు. అరకొరగా అందించే జీతాలు సైతం రెండు నెలలుగా అందడం లేదంటున్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు అందని కనీస వేతనం

జిల్లా పరిధిలో నాలుగు సంచార పశు వైద్యశాల వాహనాలున్నాయి. ఇవి కొడంగల్, పరిగి, తాండూరు, వికారాబాద్ కేంద్రాల్లో పని చేస్తున్నాయి. ప్రతీ వాహనంలో వెటర్నరీ డాక్టర్, ప్యారావిట్, హెల్పర్, డ్రైవర్ విధులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో పశువులకు ఆరోగ్య సమస్యలు ఏర్పడితే వెంటనే పశువులు ఉన్న ప్రాంతానికి వెళ్లి వైద్య సేవలు అందించాలనేది సంచార పశువైద్యశాల ప్రధాన ఉద్దేశం. 1962 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య చెబితే వాహనాన్ని పంపిస్తారు. కాగా సంచార పశువైద్యశాలలో పనిచేసే ఉద్యోగులకు మాత్రం వేతనాలు అందడం లేదు. 2017లో రాష్ట్ర వ్యాప్తంగా ఈ వాహన సేవలను ప్రారంభించారు. ఈ వాహన సేవలను పర్యవేక్షించే బాధ్యతను జీవీకే సంస్థకు అప్పగించారు. ఇందులో పనిచేసే ఉద్యోగులకు జీవీకే సంస్థ నుంచి వేతనాలు ఇస్తున్నారు. అయితే వాహనాల్లో పనిచేసే ఉద్యోగులకు కనీస వేతనాలు అమలు చేయడం లేదు. ప్యారావిట్‌కు నెలకు రూ.14వేలు, డ్రైవర్‌కు నెలకు రూ.8,500, హెల్పర్‌కు నెలకు రూ.8,500 చెల్లిస్తున్నారు. డాక్టర్‌కు మాత్రం నెలకు రూ.26వేలు ఇస్తున్నారు. 2017 నుంచి ఇప్పటి వరకు ఇదే విధంగా వేతనాలు ఇస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెంచిన విధంగా తమకు కూడా వేతనాలు పెంచాలని సిబ్బంది కోరుతున్నారు.

సేవలను గుర్తించాలి



ప్రభుత్వం మా సేవలను గుర్తించాలి. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేతనాలు చెల్లించాలి. 2017 నుంచి ఇప్పటి వరకు జీతాలు పెంచలేదు. పాత జీతాలతోనే పని చేస్తున్నాం. అవి కూడా సకాలంలో రావడం లేదు. ఖర్చులు పెరిగాయి. కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారింది.

– బాబ్జీరాం, వెటర్నరీ డాక్టర్, కొడంగల్

నేడు ఇబ్రహీంపట్నంలో మంత్రి పర్యటన

రూ.68.21కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన చేయనున్న హరీశ్‌రావు



మంత్రి హరీశ్‌రావు ప్రారంభించనున్న ఆర్డీఓ కార్యాలయ భవనం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలో గురువారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పర్యటించనున్నారు. రెండోసారి బీఆర్‌ఎస్ అధికారం చేపట్టాక హరీశ్‌రావుది ఇదే తొలిపర్యటన. ఈ మేరకు బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి మంత్రి కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆయన మంత్రి పి.సబితారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిలతో కలిసి సుమారు రూ.68.21కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలను చేస్తారన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్‌లో రూ.2 కోట్లతో నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం భవన ప్రారంభోత్సవం, రూ.5కోట్లతో లష్కర్‌గూడ వద్ద నిర్మించనున్న వంతెనకు శంకుస్థాపన, తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రజలకు తాగునీరు అందించేందుకు తొర్రూర్, కమ్మగూడ గ్రామాల మధ్య రూ.8 కోట్ల నిధులతో నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ప్రారంభోత్సవం, ఇంజాపూర్ వద్ద రూ.3.15కోట్లతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన, రూ.16కోట్ల నిధులతో తుర్కయంజాల్ నుంచి నాదర్‌గుల్ వరకు నిర్మించనున్న డబుల్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బొంగుళూరు క్రాస్ రోడ్డు వద్దనున్న కళ్లెం జంగారెడ్డి ఫంక్షన్ హాల్ సమావేశాన్ని ఏర్పాటు చేసి మహిళా సంఘాలకు రూ.286 కోట్ల రుణాల చెక్కులు పంపిణీ చేస్తారు. అనంతరం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడలో బస్తీ దవాఖాన ప్రారంభోత్సవం, రూ.11 కోట్లతో నిర్మించిన ఇబ్రహీంపట్నం ఇబ్రహీంబాషా వద్ద ఇండస్ట్రీస్ పార్కు రోడ్డు ప్రారంభోత్సవం, తట్టిఖానా వద్ద రూ.6కోట్లతో నిర్మించిన రెండు ఎస్టీ గురుకులాల ప్రారంభోత్సవం, రూ.5 కోట్లతో నిర్మించనున్న ఎస్టీ డార్మెంటరీ భవన నిర్మాణానికి శంకుస్థాపన, ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిలో డయాలిసిస్ కేంద్రం ప్రారంభోత్సవం, ఇబ్రహీంపట్నంలో రూ.5కోట్ల నిధులతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల పనుల శంకుస్థాపన, క్యాంపు కార్యాలయం వద్ద రూ.2.5కోట్లతో నిర్మించిన ఆర్డీఓ కార్యాలయం భవన ప్రారంభోత్సవం, యాచారం మండలకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో రూ.2 కోట్లతో నిర్మించనున్న అదనపు గదుల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నేతృత్వంలో జరుగనున్న ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో హాజరవ్వాలని రమణారెడ్డి కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

మంచాల: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన మంచాల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవినాయక్ తెలిపిన ప్రకారం.. బొమ్మల రామారం గ్రామానికి చెందిన మాంగ్యా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు 4క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. మాంగ్యాపై కేసు నమోదు చేశారు.

గంజాయి విక్రేతలకు రిమాండ్

- రెండు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ శంకర్‌రెడ్డి

కొత్తూరు: మండల పరిధిలోని పలు పరిశ్రమల్లో పని కార్మికులకు రహస్యంగా గంజాయి విక్రయిస్తున్న నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం కొత్తూరు పీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో సీఐ శంకర్‌రెడ్డి కేసు వివరాలు వెల్లడించారు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మనోజ్‌కుమార్, సంజిత్ దండపాత్, శివప్రదాస్ తీగాగాపూర్ శివారులోని కేశ్రీ పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తూ క్వాటర్స్‌లో నివాసం ఉంటున్నారు. వీరు వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న పలువురు కార్మికులకు గంజాయి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టి వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని విచారించగా ఒడిస్సా రాష్ట్రం నుంచి ఆనంద్ తమకు గంజాయి సరఫరా చేస్తున్నట్లు వివరించారు. దీంతో వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పరిశ్రమల నిర్వాహకులు కార్మికులకు గంజాయి నిర్మూలనపై అవగాహకల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు కె.శ్రీనివాస్, జి.శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

‘ఫార్మా’తో ప్రపంచస్థాయి గుర్తింపు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- 979 మంది రైతులకు పట్టా సర్టిఫికెట్లు అందజేత
- దసరారోజున ఇళ్ల స్థలాలు చూపిస్తామని హామీ
- భూదాన్ భూముల పరిహారంపై రీసర్వే చేయాలని నేతల వినతి



యాచారం: రైతులకు ఇళ్లస్థలాల సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: ఫార్మాసిటీతో ఈ ప్రాంతానికి ప్రపంచ స్థాయి గుర్తింపు వస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిసన్‌రెడ్డి అన్నారు. యాచారం మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఫార్మాసిటీకి భూములిచ్చిన 979 మంది రైతులకు రెండో విడిత కింద ఎకరాకు 121 గజాల చొప్పున పట్టా సర్టిఫికెట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూములు అప్పగించిన రైతులకు దసరా రోజున మీరాఖాన్‌పేట హెచ్‌ఎండీఏ వెంచర్‌లో స్థలాలు అప్పగిస్తామని తెలిపారు. ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన అసైన్డ్ రైతులకు కూడా పట్టాదారు, పాసుపుస్తకాల్లో ఉన్న ఎకరాలకు మొత్తం పరిహారం ఇప్పించినట్లు తెలిపారు.

భూదాన్ భూమిపై రీ సర్వే..

తాడిపర్తి గ్రామంలోని సర్వే నంబరు 104లోని 250 ఎకరాల భూదాన్ భూమిపై రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇచ్చిన పరిహారంపై రీసర్వే చేయించాలని ఎంపీపీ కొప్పు సుకన్య, తాడిపర్తి సర్పంచ్ రమేష్, ఎంపీటీసీ సభ్యుడు బావయ్య కోరారు. ఆ భూమిని ఏళ్లుగా పేద రైతులు కబ్జాలో ఉండి సాగు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని..అధికారులు మాత్రం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు రూ.కోట్లలో పరిహారం ఇచ్చారని వారు ఆరోపించారు. వారికి ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు ఇవ్వవద్దని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత భూమిని రీ సర్వేచేసి నివేదిక ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డిని ఎమ్మెల్యే ఆదేశించారు. కాగా ఇబ్రహీంపట్నం డివిజన్‌లోని పలు మండలాల్లో గురువారం రాష్ట్ర మంత్రులు హరీష్‌రావు, సబితారెడ్డి రూ.65 కోట్ల మేర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యాచారం ఎంపీపీ సుకన్య, ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రయ్య, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

బందోబస్తు పరిశీలన..

మంత్రులు పర్యటన నేపథ్యంలో బుధవారం యాచారం సీహెచ్‌సీని ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాస్‌రావు సందర్శించారు. బందోబస్తుపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. అదేవిధంగా సీహెచ్‌సీలోని 102, 108 వాహనాలను జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జాన్ సైదులు తనిఖీ చేశారు.

సెకండ్ ఏఎన్‌ఎంలపై నిర్లక్ష్యం తగదు

సెకండ్ ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ



కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

ఇబ్రహీంపట్నం రూరల్: సెకండ్ ఏఎన్‌ఎంలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి.. రెగ్యులరైజ్ చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సెకండ్ ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ మాట్లాడుతూ.. న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరితే కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 16 ఏళ్లుగా వెట్టి చాకిరీ చేయించుకుని నేడు నోటిఫికేషన్ విడుదల చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌తో రాష్ట్ర వ్యాప్తంగా 4,500 మంది ఏఎన్‌ఎంలను తీసివేసేందుకు కుట్ర జరుగుతోందన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన వెంటనే కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని చెప్పి మరిచిపోవడం సరికాదని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పూర్తిస్థాయిలో సమ్మెకి దిగుతున్నట్లు ఆమె ప్రకటించారు.

సమ్మెకు ఏఐటీయూసీ, బీఎస్పీ సంఘీభావం

కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సెకండ్ ఏఎన్‌ఎంలు చేపట్టిన ధర్నాకు ఏఐటీయూసీ, బీఎస్పీ పార్టీ సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పర్వతాలు, ఓరుగంటి యాదయ్య, జిల్లా కార్యదర్శి దత్తు నాయక్, బీఎస్పీ నాయకులు విజయ్, ఏఎన్‌ఎంలు సువర్ణ, మన్నెమ్మ, సుజాత, అరుణ తదితరులు పాల్గొన్నారు.